కథానిక

# ప్రమాద ఫలితం

కె. రామలక్ష్మి

అదో చిన్న పట్టణం. ఆ చిన్న పట్టణంలోవున్న పెద్దాసుపత్రిలో డాక్టరు అతను; భార్యా ఒక చిన్న కూతురూ. డాక్టరుది జాలిగుండె. అందుకే నియమితకాలం అంటూ లేకుండా, ఏవేళప్పుడు ఏ రోగి వచ్చినా, చేతులు కడుక్కొని ధర్మామిటరుతో రడీ అయ్యేవాడు. డాక్టరు భార్య ఆయనకి అన్నివిధాలా తగ్గది. కొద్దోగొప్పో చదువుకున్నది. అందుకే డాక్టరుకి యింటిదగ్గిర ప్రాక్టీసుకి ఒక నర్సు అవసరంలేకుండా పోయింది. ఇంటి పనులన్నీ సరిచేసుకొంటూ, డాక్టరు కవసరమైనప్పుడు తానే కాంపౌండరై, నర్సై, సహాయం చేస్తూండేది. అందుకే, ఆ డాక్టరు చిన్నపిల్లవాడిలా ఆమె ఆలనాపాలనా క్రింద జీవితాన్ని గడిపేస్తూ, ఏ పనీ తనంతట తను చేసుకొనే శక్తిని పోగొట్టుకున్నాడు.

మొత్తానికి ఆ డాక్టరు సంపాదించే దానితో, ఆ యిల్లు హాయిగానే గడిచిపోతోంది. డాక్టరు మెల్లిమెల్లిగా తనకు కావలసిన పరికరాలు కూడా కొనుక్కో కల్గుతున్నాడు. ఆయనదో గట్టినమ్మకం: మానవ ప్రకృతి పరిసరాల కనుగుణంగా మారుతుందనీ, దాని ప్రకారం, శారీరకంగా మార్పులూ, తద్వారా అకస్మాత్తుగా కొత్త జబ్బుల వాత పడడమూ, అంతవరకూ వున్న రోగాలు మాటు మాయమవడమూ జరగవచ్చుననీ. దాన్నే ఆధారంగా చేసుకొని డాక్టరు పరిశోధనలు జరుపుతున్నారు: ఎక్కడ? ఒక లేబ్రలేటరీలో కాదు. తనదగ్గరకి వచ్చే రోగుల పరిశీలన ద్వారానూ.

ఆ చిన్న పట్టణం పేరు నాకు తెలియదు. కాని, అది మటుకు వుంది. అందులోనూ ఎలాంటి ప్రదేశాల పరిసరాల వుందంటే ఆ పట్టణం: పిక్‌నిక్ ప్రదేశాల పరిసరాల. అంటే ఈ చిన్న పట్టణానికి ఉత్తరంగా, రెండు వందల మైళ్లదూరంలో-పేరుగాంచిన మహా పట్టణం ఒకటి వుంది. యీ వూరికి దక్షిణంగా, నలభై, ఏభయిమైళ్ళు పోతే చారిత్రక శిథిలానికి ప్రసిద్ధిగాంచిన ప్రదేశం ఒకటి వుంది. ఆ మహా పట్టణంలో ప్రాణం విసిగి, ప్రశాంతంగా, శిథిలాలను చూస్తూ, ఏకాంతంగా ఆలోచించుకుందుకు ప్రముఖు లనేకులు వాయువేగాన కార్లు తోలుకుంటూ వస్తూంటారు. ఆ కారు రోడ్డు యీ చిన్న పట్టణంలోంచి పోదు. కాని యీ చిన్న పట్టణపు పొలిమేరలలో ఒక దిక్కు ఆ రోడ్డు.

* * *

ఇది ఒక మహా పట్టణం. ఇలా ఎలా నిర్ణయించావు? అని అడుగుతారేమో. ఆ రోడ్లమీది జన సమర్దం, అంతులేని విద్యుద్దీపాల తోరణాలు, అందమైన సుందరాంగులూ, వీధికి నాలుగు కాఫీ హోటళ్ళూ...వీటన్నిటికీ పైన, మహా పట్టణానికి ఒక కొసన వుంటూ కూడా, అందరి దృష్టినీ తమ వైపే తిప్పుకొనేఫిల్మ్‌స్టూడియోలూ. పార్కులో, కాఫీ హోటళ్లలో, సినిమా థియేటర్లలో ఎంత జనం వుంటారో, యీ స్టూడియోల ముందు-మన్నూ, ఎర్రదుమ్మూ కట్టుకున్న గుడ్డలని పాడుచేస్తున్నా లెక్కచేయకండా, తారలరాక ఎదురుచూస్తూ, వేచివుండే వారి సంఖ్య కూడా అంతా వుంటుంది.

ఆ మహా పట్టణంలో ఒక చివరను యీ స్టూడియోలుంటే, ఇంకోప్రక్క ఐశ్వర్యంతో తులతూగేవారి దివ్య భవంతులన్నీ వున్నాయి. అలాంటి భవంతులకే దూరంగా వుంటూ పెద్ద ప్రహారీతో, రంగురంగు పూలతోటలతో, యెంతో అందంగా వున్న భవంతి యింకోటి వుంది. మట్టి తవ్వించి బంగారంగా మార్చుకొని, పట్టణంలో జలసా జీవితాన్ని గడిపే ఒక కుబేరుడిది ఆ యిల్లు. అతని పేరు కేశవరెడ్డి. స్నేహితులందరూ కేశవా అనే పిలుస్తారు. కేశవరెడ్డి ఆ దివ్య భవంతిలో సినీతార లీలావతితో కలిసి వుంటున్నాడు. లీలావతి పేరుమోసిన తార. ఎక్కువ

చిత్రాలలో నటించకపోయినా ఆమె కీర్తి నలు దిశలా వ్యాపించింది.

సినీతార లీలావతికీ, కుబేరుడు కేశవరెడ్డికీ, స్నేహం కలుస్తకుస్తీలుపట్టే బలరాం ద్వారాను. బలరాం, ఎలాగో తెలియదుగాని, లీలావతికి కావలసినవాళ్ళలోని వాడు. పట్టణంలో బలరాం పేరుమోసిన ఫహిల్వాన్. అయితేమటుకు! లీలావతి దగ్గర అర్భకుడే.

ఇలాంటి ఐశ్వర్యంతో తులతూగుతూ, హాయిగా కాలం వెళ్లబుచ్చుతున్నా, ఆ పట్టణం అంటే ప్రాణం విసిగింది కేశవరెడ్డికీ, సినీతారకీ. కొద్దిదూరంలోనే వున్న చరిత్రాత్మక శిథిలాలను చూస్తూ, అక్కడి ప్రశాంత వాతావరణంలో ఓ వారం రోజులు గడిపి మళ్ళీ తిరిగి పట్నం వద్దామని తోచింది వారికి. శుభ్రమైన కొత్త కారు, డ్రైవరుతో కలిసి నలుగురూ హాయిగా కూర్చోవచ్చు. ప్రయాణానికి కావలసినవన్నీ సిద్ధంచేశాడు బలరాం. కావలసిన పెట్రోలూ, కావలసిన డబ్బూ కేశవుడి కనుసన్నలలోనే వున్నాయి. ఉదయాన్నే బయలుదేరితే, అక్కడక్కడ మజిలీలు చేసినా, మరునాటి వుదయానికి అనుకొన్న స్థలం చేరవచ్చు; ప్రాణంవిసిగించిన పట్టణాన్ని మరచిపోవచ్చు.

* * *

"అబ్బా ఎందుకంత స్పీడెక్కించమంటావు?" అంటూ విసుక్కుంది లీలావతి ఆ కారు స్పీడుతోపాటే ఎగసిపడుతున్న ఊపిరితో.

"ఎందుకేమిటి-చూడేలా పరుగెడుతున్నాయో ఆచెట్లూ..అవీ,సిటీ దాటివస్తే యిదే ఆనందం..యింక స్పీడెక్కించలేవూ తంబీ?" సంతోషంతో మాటలు తడబడుతూంటే, వెనక బలరాంతో కూర్చున్న లీలావతిని చూస్తూ అన్నాడు కేశవరెడ్డి.

"ఏదైనా ప్రమాదంజరిగి మన ముఖాలు వికృతంగా తయారైతే"? తన లోలోపల వేళ్ళుతన్ని పెరుగుతున్న భయంతో అడిగింది లీలావతి.

"అంత వస్తాదు బలరాం పక్కని కూర్చుంటే నీకు ప్రమాదం ఏమిటి?" అన్నాడు రెడ్డి...

...మూడు గంటలు దాటింది. పగలా? రాత్రా? అన్నప్రశ్న మనకి కాని వాళ్ళకి లేనేలేదు. అది తెల్లవారు ఝామూ మూడుగంటలు దాటిన సమయం. తంబి ఎందుకో తనలోతను నవ్వుకొన్నాడు. అది చూసిన కేశవరెడ్డికి ఎందుకో భయంవేసింది. "చీకట్లో దారి కనిపించడం లేదేమిటి తంబీ? పోనీ స్పీడు తగ్గించు." అన్నాడు.

"అక్కర్లేదుసార్. యింత సరదాగా ఎప్పుడూ డ్రైవు చెయ్యలేదు నేను." అన్నాడు తంబి. ఈ మాటలాలకించిన లీలావతికి కోపమేవచ్చింది. కాని బలరాం మటుకు చిదానందుడిలా ఉలుకూ పలుకూ లేకుండా లీలావతిచేయి తన చేతిలోకి తీసుకున్నాడు. అతనిస్థితికి అసూయపడ్డాడు కేశవరెడ్డి. కొద్ది క్షణాలపాటు కారులోపల దారుణమైన నిశ్శబ్దం ఆవరించింది. కారు స్పీడుమాత్రం తగ్గించలేదు తంబి. ఆ తరువాత క్షణాల్లోనే, కష్టంలో వున్న మహారాక్షసిలాగా కీచుమని అరుస్తూ బ్రేకుల పట్టుకూడా లేకుండా—యీ శుభ్రమైన కొత్తకారు, ఒక చెట్టుకి గుద్దుకుని, పక్కగాతిరిగి ఒక గోతిలోకి దారి తీసింది. ఆ నిశ్శబ్దంలో, ప్రమాదానికి గురిఅయిన కారు చేసిన శబ్దం దారుణమైనదే కాని, దట్టంగా మబ్బులుపట్టి వుండడంచేతా చిన్నచిన్న చినుకులుకూడ పడుతూవుండడంవల్లా ప్రకృతి, వెర్రిగా చూస్తూవుండే కాని ఆ ఘోరమైన ప్రమాదానికి సానుభూతీ చూపలేదు; వేళాకోళమూ చెయ్యలేదు...సర్వమూ...భరింపరాని నిశ్శబ్దంలో మునిగిపోయింది.

* * *

పాలకుర్రాడు దబదబ తలుపు కొట్టడంతో చిన్న పట్టణంలోని పెద్దడాక్టరు భార్య తూలుతూ లేచింది. "వీడొకడు నా ప్రాణానికి! హడావిడిగా రమ్మంటూ ఏ మనుషులూ రాని నాడు - ఎలా తెలుస్తుందో వీడు పెందరాడే వస్తాడు." విసుక్కుంది డాక్టరుగారి భార్య. తలుపు తెరచి చూడగానే, పాల కుర్రాడి అవతారం భయానకంగావుంది.

"ఏరా అలా ఒణికిపోతున్నావు? ఏంజరిగింది?"

"అమ్మా, మనూరిపక్కగా పోతుంటే మైన్ రోడ్డు, మన బాబుగారు సాయంత్రాల షైరెడతారే, సరిగ్గా అదేచోట కారొకటి తిరగబడి పోయిందమ్మా."

"కొంపతీసి మనుషులున్నారా, ఒక్క డ్రైవరేనా?" ఆత్రుతతో అడిగింది డాక్టరు భార్య.

"లేకేం? వున్నారమ్మా," చాలా సాఫీగా చెప్పాడు పాల కుర్రాడు.

"చాలామంది జనం గుమిగూడేరా? పోలీసులూ వాళ్ళూ వచ్చేరా?"

"ఊరు తెల్లారందే జనం ఏటమ్మా, అయ్యగారు వెడితే, పోనీ దెబ్బలూ అవీ కడిగి కట్లేనా కడతారేమోనని."

అప్పటికి తట్టింది డాక్టరు భార్యకి - డాక్టరుగారిని లేపాలనీ, త్వరగా మందులు తీసుకొని ఆయన వెడితే యింకా దారుణానికి కారులోని మనుషుల పరిస్థితి దారితీయదనీ. గబగబ లోపలికి పోయింది...

డాక్టరుగారుపరిస్థితిని తెలుసుకొని, తాను చేయవలసినదేమిటో తేల్చుకొని లేచేసరికి ఆరుగంటలు కావస్తూంది. మందులసంచీ చేతపుచ్చుకొని బయలుదేరారు.

"పోలీసు స్టేషనులోచెప్పి, ఎవరితోనేనా ఆస్పత్రి అంబులెన్సు పంపమనిచెప్పి మరీ వెళ్లండి" అని జ్ఞాపకం చేసింది డాక్టరుగారిభార్య. తలలో ఏమాత్రం ఊహాలూజరగని కాలంలో, యీసలహాకి కృతజ్ఞతా పూర్వకంగా చూశారు భార్యకేసి డాక్టరు. ఆమె చిరునవ్వునవ్వింది. ఆ చిరునవ్వే తన రక్షణకవచంగా, ధైర్యంగా బయలుదేరారు డాక్టరు. లోపలికివచ్చి, డాక్టరుగారి భార్య మామూలు పనులలో మునిగిపోయింది.

కాలం ఎంత త్వరగా పరుగెట్టి పోతుందో తల్చుకుంటే ఆశ్చర్యం వేస్తుంది. అమ్మాయికి అన్నంకూడా పెట్టేసి, అన్నిపనులూ అయాయి అనగానే, భర్త భోజనం కాలేదని జ్ఞాపకంవచ్చింది డాక్టరు భార్యకి. అవును. పొద్దుట ఆరుగంటలకి వెళ్ళేరు. అక్కడి ప్రమాదం ఎంతటిదో ఏమో. రెండుగంటలైంది. యింకా యింటికిరాలేదంటే అక్కడ ఎంతచికాకు పడుతున్నారో అన్న ఆలోచనలు రాగానే డాక్టరుగారిభార్యకి ఏమీ తోచలేదు. వీధిగుమ్మంలో నుంచుంది భర్త రాకకోసం ఎదురుచూస్తూ. మూడుమూడున్న రఅవుతూంటే ఆస్పత్రి అంబులెన్సు గుమ్మంముందు ఆగింది. డాక్టరు దిగారు. ఆయనతోపాటు యిద్దరు ఆస్పత్రి కుర్రాళ్ళూ దిగారు.

"చూడు చిన్నీ, మనగది ఖాళీచేసి, యీయనకివ్వాలి. ఈయనకి ప్రమాదమైన దెబ్బలు తగల్లేదు కాని, చిన్నచిన్నవి మాత్రం వున్నాయి. మిగతా వాళ్ళు ఆస్పత్రిలో వున్నారు"...

"ఏరీ ఆయన" అని భార్య అడిగేక ఇంకా అంబులెన్సులోనే వున్నాడని జ్ఞాపకం వచ్చింది...

భార్య లోపలికివెళ్ళి త్వరగా పక్కా అదీ సర్దింది. ఆస్పత్రి కుర్రాళ్ళు జాగ్రత్తగా ఒకాయన్ని తీసుకువచ్చి పడుకో పెట్టారు. డాక్టరుగారూ భార్యా భోజనాలు ముగించి కూర్చునేసరికి సాయంత్రం అయిపోయింది. పనిపిల్లవాణ్ణి తీసుకొని అమ్మాయి ఊళ్ళోనేవున్న తాతగారింటికి వెళ్ళింది. డాక్టరుగారు నడుమేనా వాల్చకుండా టేబిలు ముందు కూర్చున్నారు. ఆయన్నిచూస్తే జాలేసినా తన అలసట బాపుకోనేందుకు అమ్మాయి పడుకొనే గదిలో నడుమువాల్చింది డాక్టరుగారి భార్య.

...అలా ఎంతసేపు నిద్రించిందో కాని, ఎవరో పిలిచినట్లనిపించి లేచింది డాక్టరుగారి భార్య. ఒకచేతికి బేండేజీ, ముఖంనిండా చిన్నచిన్న ప్లాస్టరు పేచిలు - గుమ్మాన్ని ఆనుకొని నించున్నాడా నూతన వ్యక్తి.

"మంచినీళ్లు ఆ గదిలోలేవు. కొంచంయిస్తారా?" అదివిని ఒక్క ఉదుటున లేచింది ఆమె.

"అదేమిటి! మీరలా అప్పుడే లేచిరాకూడదు. విశ్రాంతి లేకుంటే మళ్లీ మైకం వస్తుంది."

"ఫరవాలేదు. లేవకుంటే మంచినీళ్ళు ఎలాగ వస్తాయి?"

"క్షమించండి. పనివాడు లేడన్నసంగతి మరిచిపోయాను. యిదుగో యిప్పుడే పట్టుకువస్తా. మీరుపోయి పడుకోండి" అనేసినా దృష్టిమాత్రం ఆ నూతనవ్యక్తి ముఖంమీదనుంచి మళ్ళించలేదామె. ఆ వ్యక్తి చిన్నగా నవ్వుకుంటూ వెళ్ళిపోయాడు. 'ఇతనన్నమాట ఆ కారు ప్రమాదంలో ఒకడు!' అనుకొంది డాక్టరుగారి భార్య. మంచినీళ్ళూ, వేడిగా హార్లిక్సూ పట్టుకెళ్ళి యిచ్చింది. స్వంతయింట్లోలాగ హాయిగా తమ మంచంమీద పడుకున్న వ్యక్తినిచూసి నవ్వుకొంది.

"ఇంకా దీపం ఆర్పకుండా కూచుని చదువుతున్నారా? టైమెంతయిందో తెలుసా? పన్నెండు దాటింది" అంటూ భర్త చదువుకుంటున్న గదిలోకి వచ్చింది డాక్టరుగారి భార్య.

"లేదు చిన్నీ, నిద్రరావడంలేదు. నువ్వూ యిలా కూర్చుందూ... చూడు, ఆ దౌర్భాగ్యుడికి మన గదిలో పక్కేశాంకదా, నువ్వెక్కడ? నేనెక్కడ?"

"అమ్మాయి తాతగారింటినుంచి రాలేదు. మీకు యీ గదిలోనే పక్కవేశా చూడ్లేదా?"

"చూశాననుకో; పడుకోవాలనే లేదు చిన్నీ. చూడు మనింట్లో మనం హాయిగా వుండకుండా వీడోడు. వీణ్ణికూడా ఆస్పత్రిలో చేర్చేద్దామనే అనుకొన్నాను. కాని యింకో డాక్టరు అక్కర్లే దన్నాడు. యీ దెబ్బలతో ఏ హోటలు రూములోనో ఎలా వుంటాడని తీసుకువచ్చాను. ఇప్పు డనిపిస్తోంది: అనవసరంగా నీకు శ్రమకల్గించానని" ఎంతో అప్యాయంగా భార్య చేతిని తన చేతిలోకి తీసుకొన్నారు డాక్టరుగారు.

"అలా అనుకోడం ఎందుకూ? ఆయన కూడా పాపం సర్దుకుపోయే మనిషిలాగే వున్నాడు. లెండి పడుకుని ఆ కారుప్రమాదాన్ని గురించి చెప్తూ నిద్ద రోదురుగాని" అని డాక్టరుగారిని లేవతీసింది.

పడుకోగానే డాక్టరుగారి కనురెప్పలు నిద్రతో బరువెక్కి మూసుకుపోతున్నాయి. అయినా భార్యకి చెప్పాలనే కోరిక.

"చూడు చిన్నీ అంతప్రమాదం ఈ ప్రాంతాల్లో యీ మధ్య జరగలేదనుకో. పాపం డ్రైవరు చచ్చిపోయాడు. ఎవరో ఒక ఆడావిడకూడా వుంది. పాపం చాలా అందకత్తె, ఒకపక్కముఖం అంతా చెక్కుకుపోయింది."

"అయ్యో పాపం! యీ మనింట్లో వున్నాయన భార్యా?" భార్య ప్రదర్శించిన ఆత్రుతకి నవ్వుకుంటూ, "ఏం చిన్నీ భార్య అయితే; కురూపి అయితే కష్టమా?" అని అడిగారు డాక్టరుగారు.

"అయినా, ఆవిడ యీయనగారిభార్య కాదుట. సినీమాతారట." చాలా సాధారణ విషయంలాగే చెప్పారు ఆయన. కాని అదో వింతవార్తగా గోచరించింది డాక్టరుగారిభార్యకి. అయితే ఇంట్లో వున్న అతిథి ఒక రసికాగ్రేసరుడన్నమాట! అనుకొంది. యీ నూతనవ్యక్తి ఎవరు? ఏ వింత విధి అతణ్ణి యీ పంచ చేర్చింది?... అయినా ఎందుకిలా అతణ్ణి గురించి ఆలోచించడం... అనుకొందే గాని, అతిథిని గురించిన అనేక వూహాలు ఆమెని విడువక చుట్టుముట్టాయి.

* * *

వారం రోజులు గడిచిపోయాయి. ఇంట్లో ప్రవేశించిన నూతనవ్యక్తి పాతవాడయి పోయాడు. కొంచెం ధైర్యంగానే లేచి తిరుగుతున్నాడు. అనుకోకుండానే, కారణంలేకుండానే అతని ప్రతి కదలికా, డాక్టరు భార్యని ఆకర్షిస్తూంది. ఎంత వద్దనుకున్నా అతనివేపు చూడకుండా వుండలేకపోతూంది. అతను తన పేరేనా చెప్పకుండా నీ పేరేమిటి? అని సూటిగా ప్రశ్నిస్తే, మొదట అసహ్యించుకొన్నా, త్వరగానే పేరు చెప్పింది. పార్వతి అంటే ఏమిటో తెలుసా? అని చిలిపిగా నవ్వితే - కోపంతోనో, సిగ్గుతోనో తెలియదు కాని తనముఖం కందగడ్డ అయింది. అది చూసి యింకా ధైర్యంగా నవ్వేడు అతను. ఏమిటీ వ్యక్తి ధోరణి? ఏమిటీతని చనువుకి అర్థం?

"చూడండి యిలాంటి పట్టణాల్లో కూడా మీ అంత అందకత్తె లుంటారనుకోలేదు. మీరెంత అందంగా వున్నారో మీకు తెలుసా?"

"ఏం- మీ తారామణి కంటేనా?" ధైర్యంగా అడిగేసింది పార్వతి-డాక్టరుగారి భార్య.

"ఓ లీల సంగతా మీరంటూంట! ఆమెది సహజసౌందర్యంకాదు. అయినా చెట్లులేనిచోట ఆముదపుచెట్టే మహావృక్షం." సూటిగా ఆమె ముఖంలోకి చూస్తూ అన్నాడు కేశవరెడ్డి-డాక్టరుగారి యింటి అతిథి.

"చూడండి, యీ చిన్ని పట్టణంలో తగిన రాణింపు లేకుండా, యిలా మీరు శిథిలమైపోడం బాగులేదు. నాతో మా పట్నానికి రాకూడదూ? ఎన్నాళ్ళిలా చాకిరీ చేస్తూ, కాలం వృధా చేస్తారు? అయినా అలాంటి కూపస్థ మండూకంలాంటి డాక్టరుకి మీలాంటి చైతన్యంకల భార్య ఏమిటి? నే వూరికి వెళ్ళిపోతే నాతో కూడా వస్తారా?"

అప్పటికే ఏదో తెలియని అలజడికీ, తానే ఒక కూపస్థమండూకంలా కాలం గడిపేస్తున్నానన్న భయానికీ, ఈ జీవితంలో తాను పొందిన సౌఖ్యం తను పొందదగినదాంట్లో వెయ్యోవంతుకూడా

లేదని తెలుసుకొన్న నిజానికి తోడుగా-యీ వ్యక్తి మాటలు! "మీరు నాతో అలా మాట్లాడకండి! నే లేకుంటే డాక్టరుజీవితం నాశనం అవుతుంది" అంది. కేశవరెడ్డి నవ్వేడు. "మీ పిచ్చి కాని మీరుండి డాక్టరుకి ఎంత సేవ చేస్తున్నారో, ఏ పనిమనిషైనా అంతే చేస్తుంది—జీతంయిస్తే. అయినా మీరే డాక్టరుకి సర్వస్వం అన్న నమ్మకం శుద్ధ అబద్ధం. అయినా ఆలోచించుకోండి... పార్వతీ నువ్వు నాతో వస్తే పువ్వుల్లో పెట్టి పూజిస్తాను. జీవితంలో ఆనందించడం అంటే ఏమిటో చూపెడతాను. యిక్కడవుండి నువ్వనుభవించిన నరకం ఏమిటో తెలుసుకుందుగాని. పార్వతీ, రానని అనకు. రేపే నేను యిల్లు వదలి హోటలుకి పోతున్నా. ఈ వారాంతంలో వూరికి వెళ్ళిపోదాం." తన చేతులు పట్టుకొని బతిమాలుతున్న కేశవరెడ్డిని చూసింది పార్వతి. ఉత్సుకళ్ళతోటే కాదు. తన సజీవ శక్తులన్నిటితోటీ చూసింది... అవును, డాక్టరుకి కావలసినది స్వీయ సౌకర్యం. ఎప్పుడేనా సంతోషంగా వున్నావా? అన్నమాట అడగలేదే తనని! తన జీవిత సౌఖ్యాన్వేషణకోసం వెళ్ళిపోతేనేం? ఆయనకి ఆయన పరిశోధనా విషయాలున్నాయి. కాలక్షేపానికి అమ్మాయుంది. కొంచం డబ్బు పడేస్తే వంటమనిషి వస్తుంది...

* * *

సాయంత్రం ఏడుగంటలవుతూంటే డాక్టరుగారు యింటికి వచ్చారు. మనుషుల అలికిడే లేదు. పని కుర్రాడిని కేకవేశారు "అమ్మెక్కడికి వెళ్ళిందిరా? అమ్మాయేదీ?" అంటూ.

"అమ్మ సరోజినమ్మగారింట్లో ఏందో జరుగుతోందిట. ఈ రాత్రి రారు. అమ్మాయి తాతగారింటికి పోయింది. ఏదో సీటీపెట్టానని చెప్పారు" అన్నాడు పనికుర్రాడు. రాత్రికి రారు అన్న మాట వినగానే భయంవేసింది డాక్టరుకి. పార్వతిలేకుంటే ఎలాగ? అన్న భయంతో అచేతనుడై కూర్చుండిపోయాడు. ఆమె పెట్టిన చీటీలో ఏంలేదు: భోజనం అన్నీ అమారుగానే వున్నాయనీ, రాత్రికి తను సరోజిని యింట్లోనే వుండిపోతాననీ. తనకి కావలసింది భోజన సదుపాయమేనా?.....రాత్రి గంటలు లెక్కపెడుతూ అలాగే కూర్చుండిపోయాడు డాక్టరు. పార్వతినిగురించి అనేక వూహాలు కదలిపోతున్నాయి. పార్వతికి తనేమివ్వగలిగాడు?

అదే సమయంలో...కారు ప్రమాదంజరిగిన ప్రదేశంలో పార్వతీ కేశవరెడ్డీ కూర్చునివున్నారు. మౌనంగావుండే వారి హృదయాలు ఎడతెరపి లేకుండా మాట్లాడుకొంటున్నాయి. కాలం నిజంగా పసిడిరెక్కల పక్షే. ఎంత శీఘ్రగమనం దానిది!... చూస్తూండగానే మూడుగంటలుకూడా దాటిపోయింది..."యింక పోదామా?" అడిగాడు కేశవరెడ్డి. "ఎక్కడికి?" భయంగా అడిగింది పార్వతి. "యింటికి" తాపీగా సమాధానంచెప్పాడు. "ఇంటికి పోను; నీతో వచ్చేస్తాను." పార్వతి అతని హృదయం మీద వాలిపోయింది. "అలాగే; యీవాళకి యింటికివెళ్ళు. నడు, నే తీసుకువెడతాను" అంటూ లేవతీశాడు కేశవరెడ్డి. వీథులవెంటా సందులవెంటా నడిచినడిచి పార్వతి యిల్లుచేరారు. "నువ్వు వెళ్ళి ఓగంటేనా విశ్రాంతితీసుకో, నే వెడతాను" అంటూ చేయి గట్టిగానొక్కి వెనక్కేనా తిరిగిచూడకుండా వెళ్ళిపోయాడు కేశవరెడ్డి.

మెట్లెక్కి పార్వతి తలుపుతోసింది. గడియవేసి లేదు. మెల్లిగా అడుగువేసి లోనికివెడితే...ఎదురు గదిలో శూన్యంలోకి చూస్తూ దీర్ఘాలోచనలో మునిగిపోయిన డాక్టరు కన్పించారు.

"ఇంకా నిద్రపోలేదా? ఎందుకలా కూర్చున్నారు?" అంటూ త్వరగా ఆయనదగ్గరికి పోయింది పార్వతి; ఆమెని తన కౌగిలిలోకి తీసుకొన్నారు డాక్టరు.

"పార్వతీ, నువ్వు రావేమో అనుకున్నాను. నేనే ఆ సరోజినిగారింటికి వద్దామనుకున్నాను పార్వతీ...నువ్వు యింట్లో లేకుంటే ఎలాగ?" మాట్లాడుతుంటే ఆయన కంఠం వణికింది. చిన్నపిల్లవాడిలా, ఆమె భుజంమీద తల ఆన్చారు.

"ఛ...అలా ఏడుస్తారా?...లేవండి కాస్సేపు పడుకుందాం. యింకోగంటకి తెల్లారిపోతుంది... రండి" అని ఆయన్ని నడిపించుకొని వెళ్ళింది పార్వతి.

తన నడుముచుట్టూ చేయివేసి ప్రశాంతంగా కళ్ళు మూసిన డాక్టరుని చూసి చిరునవ్వు నవ్వుకొంది పార్వతి. కొద్ది గంటల క్రితంవరకూ యీ డాక్టరంటే అసహ్యంవేసిన పార్వతికి, యిప్పు

డాయనో అమృతమూర్తిలా కన్పించాడు. ఆయన తలని తన హృదయానికి కదుముకొంది. అప్పట్లో పెను అలల తాకిడికి ఓలలాడిన ఓడలా తను అశాంతితో అలజడితో కంపించింది. కాని యిప్పుడు, తుపాను తరువాత ప్రశాంతతలాగ, తన హృదయం కూడా శాంతించింది. జీవితాంతం వరకూ తనకి కావలసింది యీ ప్రశాంతమే కాని అలజడి కాదు. కేశవరెడ్డి అలజడీ-హడావిడీను. డాక్టరు ప్రశాంతతా, గాంభీర్యమూను. కేశవ రెడ్డితో జీవితంలో తనిట్టే అలసిపోతుంది. డాక్టరుతో జీవితం దినదినం తనకి శక్తినిస్తుంది-ఆ రాత్రి అనుభవంవల్ల తెలుసుకొన్న పరమ సత్యం యిదే-అనుకొంది పార్వతి.

...ఏ పట్టణంనుంచి వచ్చి యీ అలజడి రేపేడో ఆ పట్టణానికే వెళ్ళిపోనీ యీ కేశవుని. ఏ ప్రమాదమైతే అతన్నీ సహజ సౌందర్యపు ప్రాపు చేర్చిందో, అలాంటిదే ఏ ప్రమాదమూ, యీ సహజ సౌందర్యాన్ని నాశనం చెయ్యనీయక అని తనకి తనే హితబోధ చేసుకొంది-పార్వతి. తన భర్త, డాక్టరుతల తన హృదయంలో ప్రశాంతంగా నిద్రిస్తూంది; అర్థం తెలియని ఊహల సాలిగూళ్లు కూడా మెల్లిగా విడిపోయి, పార్వతి హృదయం కూడా ప్రశాంతమైంది.

ఉదయం నిద్రలేవగానే పనిమ్రాడు ఒక ఉత్తరం డాక్టరుగారి బిల్లూ చేతికిచ్చాడు. ఉత్తరం పార్వతికి-"నేను వెళ్లిపోతున్నాను. నీ జీవితం అతి సుఖవంతం. ఇదివరలో నా ఊహలన్నీ ఎంత అబద్ధమో నిన్ను చూసి తెలుసుకొన్నాను; నిన్నరాత్రి తెలుసుకున్నాను. హాయిగా వుండు. లీలావతి ఎప్పుడో వెళ్ళిపోయింది. నే వెళ్ళిపోతున్నా. ఎక్కడికి? నే వచ్చిన మహా పట్టణానికి కాదు. మా వూరికి" కేశవరెడ్డి వ్రాశాడు. పార్వతి హృదయం తేలికపడింది.

జీవితప్రవాహం యథాప్రకారం సాగిపోతుంది. వానొస్తే, వరదొస్తే ఉప్పొంగుతుంది. కాని కొద్ది రోజుల్లోనే మళ్లీ ప్రశాంత ప్రవాహమే అది.

స్కెచ్

# మాతృమూర్తికి ఉత్తరం

మొవ్వ రాంబాబు

ఉత్తరం వచ్చిందని పోస్టుజవాను ఇవ్వగానే సుభద్రమ్మగారు ఆత్రంగా తీసి చదవటం మొదలుపెట్టింది. కొడుకుదగ్గరనుండి జాబుకొరకు ఆమె అనేక నెలలనుండి ఎదురుచూస్తున్నది. ఆమె అనేకమార్లు విశ్వాన్ని ఈ విషయంపై హెచ్చరిస్తూ కూడా ఉత్తరాలు వ్రాసింది. విశ్వంతో ఉన్న చిక్కు ఇది ఒకటే. వ్రాస్తే ఒక్కటే పెద్ద ఉత్తరం-అయిదారు పేజీలది వ్రాస్తాడు. లేకపోతే నాలుగైదు నెలలవరకు అతనివద్దనుండి చిన్న విషయంకూడా తెలియదు.

"అమ్మా! నానుండి అనేకవిషయాలు తెలుసుకోవాలని చూస్తూ వుంటావు. ఏరోజు కారోజు ఇదే టైముకు బయట కిటికీలోగుండా బజారులోనిక చూస్తూ ఉంటావని నేను మరచిపోలేను. తీవ్రపరిణామాలకు దారితీసే నా యీ నిశ్చయం ఎంతనిదానంగా బలపడిందో నీకూ అంతనిదానంగానే తెలియపరచాలనే ఉద్దేశంతో ఆలస్యం చేసున్నాను. వ్యక్తులమధ్య ఏర్పడే స్నేహ సంబంధాలు - వాటి పర్యవసానాలు, వీటిని తెలియపరచటానికి నాకు ఇంకా టైము కావాలి. దాదాపు ఒక జీవితకాలమే కావాలేమో!

నా ఆరోగ్యవిషయాన్ని గురించి చెప్తాను. డాక్టరుగారు నిర్విచారంగా ఉండమని చెప్తారు. నా కొరకు ప్రత్యేకంగా ఒకనర్సును నియమించారు. నాతో కలిసి ఆమె రోజూ బీచికి వస్తూంటుంది. నిర్మల పరిచర్యలలో నీకు ఏమాత్రమూ తీసిపోదు. సామాన్యంగా సాయంత్రం షికారు వెళ్ళినప్పుడే ఎక్కువగా మాట్లాడుకొటానికి అవకాశం ఉంటుంది. జనాన్నుండి చాలాదూరం వెళ్ళి ఏకాంతమయిన ప్రదేశంలో కూర్చుంటాము. మా చుట్టూ ఎంతో నిశ్శబ్దం. సముద్రఘోషకూడా ఆ నిశ్శబ్దాన్ని భగ్నం